## తెలంగాణ తల్లి సాక్షాత్కారం

మొట్టమొదటి సారిగా తెలంగాణ తల్లి భావనను తెలుగు సాహిత్యంలో కవన కమనీయంగా సాక్షాత్కరింపజేసిన కవికుమారుడు దాశరథి.

**కోటి తెలుగుల బంగారు కొండ క్రింద**
**పరుచుకున్నట్టిసరసు లోపల వసించి**
**పొద్దుపొద్దున అందాల పూలు పూయు**
**నా తెలంగాణ తల్లి కంజాతవల్లి**

ఎంత మనోహరమైన పద్యం. ఇంకా 'నా తెలంగాణలేమ సౌందర్య సీమ, నా తెలంగాణ కోటి అందాల జాణ' అని పరిపరి విధాల సంభోదిస్తూ, సంభావిస్తూ ఉప్పొంగిపోయారు. భౌగోళిక వైశిష్ట్యం, చారిత్రక ప్రాశస్త్యం, సాహిత్య ఔన్నత్యం, పోరాట తత్వం ఒకటేమిటి విభిన్న కోణాలలో తెలంగాణ అస్తిత్వాన్ని ఆకాశానికెత్తిన కవి, దాశరథి వలె ఇంకొకరు లేరంటే అతిశయోక్తి లేదు. విశాలాంధ్ర ఏర్పాటు కోరుకుంటూ దాశరథి 'మహాంధ్రోదయం' రచించారు. అయితే, ఆ పద్యాలలోనూ తన తెలంగాణ వారసత్వాన్ని సగర్వంగా ప్రకటించుకున్నారు. విశాలాంధ్రకు సంబంధించిన ఒక ఉద్వేగం దాశరథిని ఆవరించింది. దేశ స్వాతంత్ర్యం, విశాలాంధ్ర ఆవిర్భావం రెండూ గొప్ప ఆశయాలుగానే ఆయన భావించారు. ఆ ప్రతిపాదన వెనుక తెలంగాణకు పొంచి ఉన్న ప్రమాదాన్ని గమనించలేని ప్రమత్తత ఒక్క దాశరథినే కాదు, ఆనాడు తెలంగాణలో అనేకమందిని ఆవరించిదన్న మాట కాదనలేం. అయితే, అస్తిత్వవాదానికి అది మాత్రమే కొలమానం కాదు. దాశరథి తెలంగాణతనాన్ని ఎట్లా ప్రకటించారు, తెలంగాణ తనాన్ని ఎట్లా వ్యక్తం చేశారన్నది ముఖ్యమని అంటారు కె.శ్రీనివాస్. కార్మిక వర్గం నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎదిగిన టి.అంజయ్య రూపాన్ని, భాషను ఒక ప్రధాన పత్రిక పనిగట్టుకొని అవహేళన చేసిన సమయంలో.. 'అంజయ్య మాట్లాడిందే అసలయిన తెలుగ'ని దాశరథి స్పష్టం చేశారు. తెలుగు తల్లే తప్ప తెలంగాణ తల్లి ఎక్కడిదని సమైక్యవాదులు ప్రశ్నించినపుడు 1948 లోనే తెలుగు సాహిత్యంలో దాశరథి ప్రతిష్ఠించిన తెలంగాణ తల్లిని మనం సగర్వంగా చూపించాం.

---



పండిత నెహ్రూతో.. కవి పండితుడు

చత్రం ఏదైనా ఆయన భావావేశాన్ని సమర్థంగా ప్రసరింపజేసే ఉష్ణ వాహకాలే అయ్యాయి తప్ప అవరోధాలు కాలేదు.

**జెండా ఒక్కటె మూడు వన్నెలది**
**దేశం బొక్కటే భారతా ఖండాసేతుహిమాచలోర్వర**
**కవీత్కాండములోనన్ రవీంద్రుడొక్కడే కవీంద్రుడు**
**ఊర్జితజగద్యుద్ధాలలో శాంతి కోదండోద్విజయుండు**
**గాంధి ఒకడే 'తల్లీ! మహా భారతీ'**

అంటూ జాతీయతా భావన ముప్పిరిగొన్న ఈ పద్యం ప్రచండ వేగాన్ని, జలపాతపు హోరును తలపిస్తుంది. దాశరథి చేసే సమాస కల్పన శ్రీనాథ మహాకవిని తలపిస్తుందని జ్ఞానపీఠ పురస్కార గ్రహీత సి.నారాయణ రెడ్డి ప్రశంసించారు. దాశరథిని తనకు మార్గదర్శిగా చెప్పుకొన్నారు సినారె. తన తరుణ కవితాలత పైకి ఎగబాకలేనప్పుడు మించు పందిళ్లు వైచి, కెంజాయలద్దినాడని మురిపెంగా చెప్పుకొన్నారు.

దాశరథి పద్యం ఎంత తీవ్రంగా ఉంటుందో అంత ఆర్ద్రంగానూ ఉంటుంది. తన రుద్రవీణ కావ్య ప్రయోజనాన్ని ఈ పద్యంలో కరుణరసార్ద్రంగా పలికించారు దాశరథి

**చింతలతోపులో కురియు**
**చిన్కులకున్తడిముద్దయైన బా**
**లెంతయొడిన్ శయించు పసి**
**రెక్కల మొగ్గను వోనిబిడ్డకున్**
**బొంతలు లేవు కప్పుటకు**
**బొంది హిమంబయిపోవునే మొ వా**
**యింతునురుద్రవీణపయి**
**నించుక వెచ్చని అగ్ని గీతముల్...**

అది చింతల తోపు, ఆపై వాన చినుకులు. తడిముద్ద అయిన బాలింత ఒడిలోని రెక్కల మొగ్గ వంటి పసి బిడ్డ దేహం మంచు వలె గడ్డకట్టుకుపోతుందేమో, రుద్రవీణపై ఒకింత వెచ్చని అగ్నిగీతాలను వాయిస్తానని అంటున్నారు..

భారత సైన్యం రాకతో నిజాం రాచరికం ముగిసిపోయింది. ఈ సందర్భాన్ని ప్రకృతికి అన్వయిస్తూ రాజకీయ అర్థాన్నీ ధ్వనింపజేశారు.

**ఉషస్సు కిర్మీర కవాటం తోస్తూ**
**ఒక్కమాటు చూసిందిటు**
**తమస్సు పాషాణ కిరీటం తీస్తూ**
**ఒక్క పరుగు తీసిందటు**

దాశరథి అభ్యుదయ దృక్పథంతో చేసిన రచనలలోని కవితా వాక్యాలెన్నో ప్రసిద్ధిచెందాయి. 'నా గీతావళి ఎంత దూరము ప్రయాణంబౌనో; అందాక ఈ భూగోళమ్మున అగ్గి వెట్టెదను'– నా పేరు ప్రజాకోటి, నా ఊరు ప్రజావాటి, – 'అనాదిగా సాగుతోంది అనంత సంగ్రామం, అనాథుడికీ, ఆగర్భ శ్రీనాథుడికీ మధ్య'– వంటి వాక్యాలెన్నో చిరస్థాయిగా నిలిచిపోయినాయి.

### లలిత గీతాల్లోనూ మేటి

మనోహరమైన ఊహలతో, మంజులమైన శబ్దాలతో దాశరథి రాసిన లలిత గీతాలు ఎన్నో. రేడియో ముఖంగా ప్రసారమైన ఆ పాటలు ఇప్పటికీ మన తలపుల్లో నిలిచిమాధుర్యాన్ని పంచుతున్నాయి. ఘంటసాల గొంతులో జాలువారిన 'తలనిండ పూదండ దాల్చిన రాణీ మొలక నవ్వుల తోడ మురిపించబోకే' అనే ప్రణయగీతం మన చెవుల్లో ఇప్పటికీ మార్మోగుతూ ఉంటుంది. అదిగో నల్లని మెయిలూ, అదిగో చల్లని మెయిలూ, గగనేందిర గళమందున కలువపూల హొయలూ హొయలూ... ఈ పాట చిత్తరంజన్ మెత్తని గొంతుతో నేర్పిస్తుంటే సంగీత విద్యార్థులు పాడుతుంటే వినటం ఎంతో హాయి గొలిపేది. దాశరథి అద్భుతమైన బాలసాహిత్యాన్ని సృజించాడు. 'తల్లీ భారతి వందనం నీ ఇల్లే మా నందనం' అని పిల్లల కోసం రాసిన దేశభక్తి గీతం బడుల్లో ప్రార్థనా గీతంగా పాడుకున్నం.

### శతజయంతిని ప్రభుత్వం నిర్వహించాలి

కవిత్వ కళలో అసమానమైన ప్రతిభా సంపన్నుడైన దాశరథి నిజజీవితంలో లౌక్యం తెలియని భోళాశంకరుడు. ఆయనకు రావాల్సినంత పేరు రాలేదు. అందుకు ఆయన తెలంగాణ తనమే కారణం. ఆయన నిరాడంబరంగా నిస్వార్థంగా బతికారు. దాశరథి మరణానంతరం ఆయన కుటుంబం పరిస్థితి అంతంత మాత్రమే. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు దాశరథి కుమారుడు లక్ష్మణ్‌కి టీశాట్లో ఉద్యోగం కల్పించారు. ఉద్యోగంలో కొనసాగి వయసురీత్యా ఇటీవలే ఆయన రిటైర్ అయ్యారు. కేసీఆర్ స్వయంగా పూనుకొని ప్రభుత్వ పక్షాన లక్ష రూపాయల అవార్డును దాశరథి స్మరణలో నెలకొల్పారు. 2015 నుంచి ఏటా క్రమం తప్పకుండా ఆయన జయంతి సందర్భంలో ఈ అవార్డును అందించారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆ విధానాన్ని కొనసాగించాలనీ, కొనసాగిస్తుందని ఆశిద్దాం. ఈ సంవత్సరం శతజయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుతుందని కాంక్షిద్దాం. ■